
*** రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్: 4.40 (ఆదివారం)



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 | కనిష్ఠం 24.2



గోప్యత గోవిందా

మూలాలు ఇక్కడే !

- తీగ లాగే కొద్దీ కదులుతున్న డొంక
- ఫోన్ ట్యాపింగ్ టీమ్‌తో అంటకాగిన జిల్లా పోలీసుల పాత్ర ఒక్కోటి వెలుగులోకి
- ఇప్పటికే కీలకమైన వ్యక్తులను విచారించిన దర్యాప్తు బృందం
- నల్లగొండలో వార్‌రూమ్ నిర్వహణపై లోతుగా సాగుతోన్న విచారణ

రాష్ట్రంలో ఏ సంచలనం జరిగినా మూలాలు నల్లగొండ జిల్లాలోనే ఉంటున్నా యి. ఒకప్పటి సిమి ఉగ్రవాదుల నుంచి మొదలు మొన్నటి కరోనా.. నిన్నటి ఫోన్ ట్యాపింగ్ వరకూ ఉమ్మడి జిల్లా పేరును సంచలనంగా మారుస్తున్నాయి. హైదరాబాద్‌కు దగ్గరలో ఉండడం, రాజకీయ ఉద్దండులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలవడం తదితర కారణాలు ఏవైనా నల్లగొండ జిల్లా ప్రస్తావన నిత్యం చర్చనీయాంశంగా మారుతూనే ఉంటుంది. ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడిన ప్రభాకర్‌రావుతోపాటు తిరుపతన్న, భుజంగరావులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే తొలుత పనిచేశారు. ఇక్కడ ఏర్పడిన బంధంతోనే మళ్లీ ఒక్కటై ట్యాపింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అయితే ఈ ట్యాపింగ్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా నేతల సంభాషణలను రికార్డు చేసి, తమకు కావాల్సిన వారికి అందజేసేందుకు వార్‌రూమ్ లను కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ, భువనగిరి టౌన్)

జిల్లాలోనూ కొనసాగిన ట్యాపింగ్

రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసుల పాత్ర ఒక్కోటిగా వెలుగులోకి వస్తోంది. నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐని ఇప్పటికే విచారించగా, నల్లగొండలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నిర్ధారించిన భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తాజాగా ట్యాపింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. విచారణ కొనసాగుతున్న కొద్దీ ఇంకా ఎవరెవరు బయటకు వస్తారోననే ఉత్కంఠ పోలీస్ శాఖలోనే కాదు, జిల్లా అంతటా నెలకొంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఆయనకు ఉన్న పరిచయాలతో సదరు అధికారులను ట్యాపింగ్ టీమ్‌లో చేర్చుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న సహా ఇటీవల విచారించిన మరో ఇన్‌స్పెక్టర్ సైతం ఇలా పరిచయమైన వారేనని పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా, సూర్యాపేట జిల్లాలో మేళ్లచెర్వులో మైంహోమ్ సిమెంట్స్ పరిశ్రమ విస్తరణ సందర్భంగా, ఆ తర్వాత ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ విస్తృతంగా జరిగినట్లు సమాచారం. నల్లగొండ, మహబూబ్‌నగ ర్ జిల్లాలను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకొని నల్లగొండలోనే ట్యాపింగ్ సెంటర్ నిర్వహించారని, రెండు జిల్లాలకు సంబంధించి ప్రతిపక్ష నాయకులు, వారు సన్నిహితంగా ఉండేవారి ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మునుగోడు ఉపఎన్నిక సమయంలో ప్రతిపక్షాలకు చెందిన నాయకుల ప్రతి కదలికను ట్యాపింగ్ ద్వారా గుర్తించి, అప్పటి అధికార పార్టీని అప్రమత్తం చేశారనే ఆరోపణలు ట్యాపింగ్ నేపథ్యంలో కీలకనేతలు చేస్తుండడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతల్లో ఉన్న నేతలు ఈ ఆరోపణలు చేయడంతో ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ సీరియస్‌గా మారుతోంది. జిల్లాలో నెలకొల్పిన వార్‌రూమ్‌లో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని గుర్తించారని, వారందరి నుంచి వివరాలు సేకరించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం ఎవరిపాత్ర ఏమిటనేది నిర్ధారిస్తారని తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్యాపింగ్ బృందంతో కలిసి ఎవరెవరు పనిచేశారు..? ట్యాపింగ్‌లో వీరు చేసిందేమిటనే అంశాలపై ఇప్పటికే పోలీసుల అదుపులోఉన్న నిందితులు చెబుతున్న ప్రకారం ఒక్కొక్కరిని విచారణకు పిలుస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఒక్కో అంశం బయటకు వస్తుండడంతో ఇంకా ఏమేం వెలుగులోకి రానున్నాయనే అంశంపై పోలీసుశాఖలో, రాజకీయవర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.


జోరుగా కొనసాగుతున్న చర్చ

ఫోన్ ట్యాపింగ్ నిందితుల్లో నలుగురు పోలీస్ అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన వారే. ఆ నలుగురిలో ముగ్గురు నేడు కటకటాల పాలుకాగా, మరొకరు విదేశాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఆ నలుగురు ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన నిందితులుగా ఉండడంతో ఉమ్మడి జిల్లాలో వారు పని చేసిన ప్రాంతాల్లోని ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. అలాగే వారి గత ఉద్యోగ నిర్వహణ తీరు, అప్పటి కేసులపై కూడా పలు రకాలుగా విశ్లేషించుకుంటున్నారు. వారితో అప్పట్లో సన్నిహితంగా మెదిలిన పలువురు ఉలిక్కిపడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో సెంట్రల్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగి న ఫోన్ ట్యాపింగ్ లో ఉమ్మడి జిల్లా ఎస్పీగా పనిచేసిన టి.ప్రభాకర్‌రావు ప్రధాన నిందితుడిగా ప్రచారం అవుతుండగా, మరో ఇద్దరు అదనపు ఎస్పీ అధికారులు తిరుపతన్న, భుజంగరావు, డీఎస్పీ ప్రణీత్‌రావు ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పనిచేశారు. అయితే వీరందరూ పలు సందర్భాల్లో తీవ్ర ఆరోపణలను మూటగట్టుకొని పోలీస్ విచారణను ఎదుర్కొన్న నేపథ్యం ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి.

అర్ధాంతర బదిలీ, నయీం ముఠా ఆగడాలకు సహకరించినట్లు ఆరోపణలు

ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో నలుగురు పోలీస్ అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పలుహోదాల్లో పని చేశారు. వారిలో ఇద్దరి మొదటి పోస్టింగ్స్ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఉండడం గమనార్హం. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఉమ్మడి జిల్లా ఎస్పీగా పనిచేశారు. 2015లో సూర్యాపేటలో జరిగిన కాల్పుల ఘటనల్లో ఒక కానిస్టేబుల్, హోంగార్డు మృతి చెందడం, సీఐ మొగులయ్య గాయపడడాన్ని తీవ్రంగా పరిగణించి న అప్పటి ప్రభుత్వం ఎస్పీ టి.ప్రభాకర్‌రావును అర్ధాంతరంగా సీఐడీ ఎస్పీగా బదిలీ చేసింది. అప్పట్లోనే అతను పలు ఆరోపణలు కూడా ఎదుర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో కటకటాల వెనుక ఉన్న అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు కూడా ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరిన తిరుపతన్న 1992లో భువనగిరి పట్టణంలో ప్రొబెషనరీ ఎస్ఐగా పని చేసిన అనంతరం 1993లో మొదటి పోస్టింగ్ యాదగిరిగుట్ట ఎస్ఐగా పనిచేశారు. అనంతరం భువనగిరి, మిర్యాలగూడ, తుంగతుర్తి, సూర్యాపేట, నల్లగొండ, చౌటుప్పల్, కోదాడ పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐ, సీఐగా పనిచేశారు. అనంతరం ఇతర జిల్లాలకు పదోన్నతి బదిలీపై వెళ్లి ఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగు చేసే వరకు అదనపు ఎస్పీగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో నయీం ముఠా సాగించిన అరాచకాలకు తనవంతు సహకారం అందించేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నయీం ఎన్‌కౌంటర్ అనంతరం అతనిని పోలీస్ అధికారులు ప్రశ్నించి విచారణ కూడా జరిపారు. అలాగే ఇటీవలి వరకు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలులో ఉన్న భుజంగరావు 2019 నుంచి 2021 వరకు భువనగిరి ఏసీపీగా పని చేశారు. అదే సమయంలో బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ పరిధిలోని హాజీపూర్‌లో జరిగిన ముగ్గురు బాలికల హత్య కేసును చేధించినందుకు ఉత్తమ పోలీస్ అవార్డు కూడా అందుకున్నారు. అయితే అప్పటి ప్రభుత్వంలో, పోలీస్ శాఖలో తనకున్న పలుకుబడితో పలు సివిల్ తగాదాల్లో తలదూర్చి పెద్ద మొత్తంలో వెనకేసుకున్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ ఉదంతానికి ప్రధాన కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్‌రావు ఉద్యోగ ప్రస్థానం కూడా యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ప్రారంభమైంది. అతడి మొట్టమొదటి పోస్టింగ్ 2007లో వలిగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం సంస్థాన్‌నారాయణపురం, 2014 నుంచి 16 వరకు బీబీనగర్ ఎస్ఐగా కూడా పని చేసి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు.





వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్

రాజకీయ నాయకులు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ చేసినట్లు వస్తున్న ఆరోపణలు ఉమ్మడి జిల్లాలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అప్పటి విపక్షం.. నేటి అధికార పక్షమైన కాంగ్రెస్‌కు చెందిన కీలక నాయకులు ఉమ్మడి జిల్లా నుంచి ఉన్న నేపథ్యంలో వారి ఫోన్లన్నీ ట్యాపింగ్ అయినట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తూ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. మునుగోడు ఉపఎన్నికలో అప్పటి బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే ప్రధాన కారణమని అప్పటినుంచి ఇప్పటి వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు మరోమారు తెరపైకి వచ్చాయి. ఈ మేరకు అప్పటి ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ జరపాలని కిషన్‌రెడ్డి తాజాగా డిమాండ్ కూడా చేశారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ఓ పరిశ్రమ ఏర్పాటుపై జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగానే ప్రజాభిప్రాయ సేకరణకు ముందే పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించిన పలువురిని అరెస్ట్ చేయడం, ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో కటకటాల వెనుక ఉన్న తిరుపతన్న గతంలో ఆ ప్రాంతంలో సీఐగా విధులు నిర్వహించిన పరిచయాలతో ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగా అక్కడే మకాం వేసి ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ రియల్ ఎస్టేట్ భూమ్‌లో కీలకమైన యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ భూముల క్రయ విక్రయాలపై కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వడదెబ్బపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

కలెక్టర్ దాసరి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఇప్పుడే 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వీటన్నింటి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు బయటికి వెళ్లే సమయంలో శరీరం ఎండ వేడిమి తగలకుండా రుమాలు ధరించాలన్నారు. వాంతులు, విరేచనాలు వంటివి సంభవిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలన్నారు. వేసవి కాలంలో నీరు ఎక్కువగా తీసుకోవాలని, అలాగే ద్రవ పదార్థాలు వాడాలని, మాంసాహారం తీసుకోవద్దని, శాకాహారం నీరు ఎక్కువగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లాలని, బయటికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఎండ వేడిమి తగలకుండా పలుచని, వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలని, కూలీలు పనిచేసే చోట కుండల ద్వారా తాగునీరు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి ఉపాధి హామీ పథకం కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే వారి కోసం తాగునీరు, నిలువ నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోకసభ ఎన్నికలు మేనెలలో నిర్వహిస్తున్నందున ఓటేసేందుకు వచ్చిన ప్రజలు ఉష్ణోగ్రతల కారణంగా ఇబ్బందులు పడకుండా టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులందరూ వారి వారి పరిధిలోని సంక్షేమ హాస్టళ్లకు వెళ్లి పిల్లలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, తీవ్రమైన వేడిగాలుల వల్ల ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో తాగునీటి ట్యాంకులన్నింటినీ శుభ్రంచేసి ఉంచాలన్నారు. మూగజీవాల తాగునీటి కోసం నీటి తొట్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండల్‌రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బయటికి వెళ్లాలన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) టి.పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్

నల్లగొండటౌన్, ఏప్రిల్ 5: సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రాం సేవలు మరువలేనివని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. జగ్జీవన్ రాం 117వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) టీ.పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌వో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రాములు నాయక్ అధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ సీఐ సైదులు, ఆర్ఐ సురప్పనాయుడు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

బీఆర్‌ఎస్‌కు ఝలక్!

- సాగర్ నియోజకవర్గంలో కీలకనాయకుల గుడ్‌బై
- రఘువీర్‌రెడ్డికి మద్దతిస్తున్నట్లు ప్రకటన
- ఇతర నియోజకవర్గాలపైనా కన్ను



సాగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల సమరం ఊపందుకుంటున్న తరుణంలో జిల్లాలో బీఆర్‌ఎస్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఆ పార్టీకి చెందిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి వస్తే, మరోవైపు ద్వితీయశ్రేణి నాయకులు, ప్రజాప్రతినిధులు తాజాగా అధికార కాంగ్రెస్ బాటపడుతున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ చేస్తే, మంత్రులు, ఎమ్మెల్యేలు పోటాపోటీగా తమ నియోజకవర్గాల్లో మెజార్టీలు తెస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులకు వల వేస్తోన్న కాంగ్రెస్ నేతలు ఆపరేషన్ మొదలుపెట్టారు. మాజీమంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి తరఫున మంత్రాంగం నడుపుతూ చేరికలకు జెండా ఊపుతుండడంతో దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ కేడర్‌లో లుకలుకలు మొదలయ్యాయి.

పార్టీ వీడుతున్నట్లు ప్రకటించిన నేతలు

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీ కీలక నాయకులు నాగార్జునసాగర్‌లో సమావేశం నిర్వహించి మరీ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. తమ అధికారిక పదవులకు సైతం రాజీనామా చేస్తున్నట్లు ఈ నేతలు ప్రకటించడం గమనార్హం. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, పెద్దవూర జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, గుర్రంపోడు ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్‌తోపాటు, తమ అధికారిక పదవులకూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీరితోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ త్రిపురారం మండల అధ్యక్షుడు బహూనూతల నరేందర్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. వీరితోపాటు నియోజకవర్గంలోని మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కీలకనాయకులు దాదాపు 200మంది పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడంతో సాగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కీలకమైన కేడర్‌ని కోల్పోయినట్లయింది. మరోవైపు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ అడవిదేవులపల్లి మండల అధ్యక్షుడు కూరాకుల చినరామయ్య ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. చినరామయ్య, ఆయన భార్య మంగమ్మ గ్రామ సర్పంచులుగా పనిచేయడంతోపాటు, మంగమ్మ ఉమ్మడి దామరచర్ల మండలం వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యురాలిగా, ఎంపీపీగా కూడా పనిచేశారు. మండలవ్యాప్తంగా అనుచరవర్గం కలిగిన చినరామయ్య తనలేఖలో మాజీమంత్రి జానారెడ్డితో తనకున్న సుదీర్ఘ స్నేహబంధంతోనే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు, రఘువీర్‌రెడ్డి విజయం కోసం పనిచేయనున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు దేవరకొండ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే బాలూనాయక్ నేతృత్వంలో చేరికల పర్వం కొనసాగుతోంది. డిండి జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు ఇప్పటికే తన అనుచరవర్గంతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ నియోజకవర్గంలోనూ జానారెడ్డి, బాలూనాయక్ తమకున్న పరిచయాల ద్వారా కీలకమైన ఇతర పార్టీల నాయకులు, మాజీ సర్పంచులను పార్టీలోకి చేర్చుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు చర్చ సాగుతోంది.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- అందుకే పార్టీలో చేరుతున్నాం
- బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సాగర్ నియోజకవర్గ నేతలు

నాగార్జునసాగర్: గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర, హాలియా, త్రిపురారం, గుర్రంపోడు, మండలాలలతోపాటు నందికొండ మునిసిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, 200 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు, పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం వారంతా సాగర్ హిల్‌కాలనీలో పెద్దవూర జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మా ట్లాడుతూ గత ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి జరిగినా, పూర్తిస్థాయిలో గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో సాధ్యమన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరిగేందుకే తామంతా బీఆర్‌ఎస్‌కు, తమ పదవులకు రాజీనామాచేసి ఈనెల 18న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారంతా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి దగ్గరి అనుచరులు కావడం విశేషం. బీఆర్‌ఎస్ పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన వారిలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, గుర్రంపోడు ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, పెద్దవూర వైస్ ఎంపీపీ గోనె వివేకరావు, రామలింగం, త్రిపురారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నందికొండ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కర్ణ అనూష శరత్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంద రఘువీర్, పెద్దవూర మండల ప్రధాన కార్యదర్శి కర్నాటి వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, కొండల్, శ్రీను, వెంకటేశ్వర్లు, మధు, బోయ నరేందర్‌రెడ్డి, హైమద్ అలీ ఉన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

రామగిరి, ఏప్రిల్ 5: రైతు వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి, పార్టీ జాతీయ నేత మురళీధర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక గడియారం సెంటర్‌లో జరిగిన రైతు సత్యాగ్రహ దీక్షలో పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతురుణ మాఫీ చేయకుండా ఆటలు ఆడుతోందన్నారు. ఆరు గ్యారెంటీలు, అరవై అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుల సంక్షేమంపై ఆలోచన చేయకుండా పదవులపై ఆలోచన చేస్తోందన్నారు. ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిరంకుశత్వానికి చరమగీతం పాడి, కాంగ్రెస్‌కు పట్టంకట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే నేడు పంటలు ఎండిపోయాయన్నారు. పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి మాట్లాడుతూ రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని, పంట ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహ్మారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, లాలూనాయక్, గోలి మధుసూదన్‌రెడ్డి, నాయకులు పోతేపాక సాంబయ్య, ఫకీర్ మోహన్‌రెడ్డి, గడ్డం మహేశ్, పెరిక మునికుమార్, వంగూరి రాఖీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావెళ్ళ కాశమ్మ, పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు నిమ్మల సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

జాతీయవాదంకోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు మరువలేనివని మురళీధర్‌రావు అన్నారు. ఏబీవీపీ నాయకులు ఏచూరి శ్రీనివాస్, మన్యం చిన్నమల్లారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గుండగోని మైసయ్య ఇంటికి, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓరుగంటి రాములు, కోతి రాంరెడ్డి ఇంటికి వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5: ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ చందనా దీప్తి సూచించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించాల న్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే జాతీయ, రాష్ట్ర రహదారులపైన ప్రమాద సూచికలు, బ్లాక్ స్పాట్ ఏరియాలను గుర్తించి, రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో రహదారి వెంట వాహనాలు నిలిపి ఉండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులు, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి రోడ్డు భద్రతపై చైతన్య పరుస్తున్నామని తెలిపారు.

సంస్కృతి, సంస్కారానికి ప్రతీక రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు


రామరాజ్ కాటన్ వస్త్రాల షోరూంను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5 : దేశ సంస్కృతికి, సంస్కారానికి రామరాజ్ కాటన్ వస్త్రాలు అద్దం పడతాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఆధునిక హంగులతో అత్యధిక డిజైన్లతో ఏర్పాటుచేసిన రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల షోరూంను శుక్రవారం ఆయన మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రామరాజ్ కాటన్ వస్త్రాలను కొనుగోలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రామరాజ్ కాటన్ వస్త్రాలు నాణ్యతకు మారుపేరని, పేరెన్నికగన్న రామరాజు కాటన్ వస్త్రాలు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. వివాహాది శుభకార్యాలకు నల్లగొండ పట్టణ ప్రజలు హైదరాబాద్ వంటి పెద్దపెద్ద నగరాలకు వెళ్లకుండా నల్లగొండలోనే కొనుగోలు చేసేలా షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల షోరూంను జిల్లా ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డిని షోరూం నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షోరూమ్ ఇన్‌చార్జి రాకేష్, ఏరియా మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికొండపై వైభవంగా ఏకాదశి పూజలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 5: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన పూజలు జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను పంచామృతాలు, తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయం ముఖమండపంలో కవచమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు పొదిగిన బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. సహస్రనామార్చనలను పఠిస్తూ వివిధ పుష్పమాలికలతో లక్షపుష్పార్చన చేపట్టారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో కొలువుదీరిన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యార్చనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,63,333ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.


ప్రధానాలయంలో లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నందికొండలో ఒకటోవార్డుకు
నీటి సరఫరా పునరుద్ధరణ

● కోతులు చనిపోయిన నీటి ట్యాంకు మూసివేత

నాగార్జునసాగర్, ఏప్రిల్ 5 : నల్లగొండ జిల్లా నందికొండ మునిసిపాలిటీలో ఒకటవ వార్డుకు శుక్రవారం నూతన పైప్‌లైన్ నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. 10 రోజుల కిందట దాహార్తి తీర్చుకోవడానికి వెళ్లి మినీట్యాంకులో పడి 30కోతులు మృతి చెందగా, రాజకీయ దుమారం నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మినీట్యాంక్‌ను మూసివేయడంతో పాటు ట్యాంక్ పరిధిలోని కాలనీలోని ఇళ్లకు నేరుగా పైప్‌లైన్ ద్వారా తాగు నీటి సరఫరాను చేస్తున్నట్లు ఈఈ మల్లిఖార్జున్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్‌తో నీటిసరఫరాపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


ఇళ్లకు నేరుగా నీటిసరఫరా చేసేందుకు పైప్‌లైన్ వేస్తున్న ఎన్‌ఎస్‌పీ సిబ్బంది

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


హలీం మృతదేహం

కోదాడ రూరల్, ఏప్రిల్ 5 : విద్యుదాఘాతంతో సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హలీం(24) సుతారీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం ఉదయం నల్లబండగూడెం గ్రామశివారులోని రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద గల షేక్ రహీం కొత్త ఇంటి మీద పనిచేస్తున్నాడు. 11.30 గంటల సమయంలో తన చేతిలో ఉన్న అల్యూనియం ఫాస్టింగ్ బద్దె పైకి లేపాడు. దీంతో ఇంటిపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హలీం తండ్రి అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా రాయినిగూడెం సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలోని సెవెన్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతడు మతిస్థిమితం లేని వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉండొచ్చని, ఎత్తు 5.8 అడుగులు, కోల ముఖం, మృతుడి కాళ్లకు గీత కార్మికుడి మాదిరిగా తాటిచెట్టు ఎక్కిన వ్యక్తిగా కనబడుతున్నట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి 8712686006, ఎస్ఐ బాలునాయక్ 8712686030 నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రురాలు..

కేతేపల్లి, ఏప్రిల్ 4 : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళ్ళపురం గ్రామానికి చెందిన ఆమనగంటి అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. జీవనోపాధి కోసం అశోక్ ట్రాలీ ఆటోను జీహెచ్ఎంసీలో చెత్త సేకరణకు పెట్టాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం స్వగ్రామం ఇస్తాళ్ళపురంలో నిర్వహించే పండగ కోసం కుటుంబ సభ్యులతో కలిసి ట్రాలీ ఆటోలో బయలుదేరాడు. కార్యక్రమం పూర్తికావడంతో బుధవారం సాయంత్రం ఆటోలో హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో ఆటో ఇనుపాముల బస్‌స్టేజీ సమీపంలో అదుపు తప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న ఆమనగంటి మల్లయ్యతో పాటు అశోక్ తల్లి ఎల్లమ్మ, నాయిని అనంతమ్మ, నాయిని భారతమ్మ, నాయిని ఎల్లయ్య, ఆమనగంటి పూలమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమనగంటి ఎల్లమ్మ(44)మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే కరువు పెరిగింది


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరువు తీవ్రత పెరిగిందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు ఎకరాకు రూ.25 నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయాయని అన్నారు. సాగునీటి కొరతతో పంట నష్టపోయి పెట్టుబడి కూడా చేతికందక అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్, సూర్యాపేట జనగాం జిల్లాల్లో ఎండి పంటలను పరిశీలించేందుకు మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టగానే ప్రభుత్వం మేల్కొందన్నారు. ఎందుకూ పనికిరాదని రాద్ధాంతం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి ఎస్సారెస్పీ ద్వారా సీఎం, మంత్రులు నీటిని విడుదల చేశారన్నారు. ప్రాజెక్టులో నీరు నిల్వలేదని చెప్పిన సీఎం, మంత్రులు ఈ రోజు ఎక్కడి నుంచి నీటిని తెచ్చి వదిలారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీసీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నీరు లేక ఎండిపోయిందన్నారు. సాగునీటిని వదిలి పంటలను రక్షించాలని ప్రతిపక్షాలు గగ్గోలుపెట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులు నిండా మునిగారని ఆరోపించారు. మార్చి నెలలో 12 రోజుల పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పొలాలకు నీళ్లు వదలకుండా పోలీసులను, అధికారులను కాపలాపెట్టి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లారని అన్నారు. జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిల చేతకానితనం వల్లే ఉమ్మడి జిల్లాకు నీరివ్వకుండా ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు, ప్రజలు అల్లాడుతున్నా జిల్లా మంత్రులకు సోయిలేకుండా నిద్రపోతున్నారని విమర్శించారు. ఎడమకాల్వ పరిధిలో 41 ఎత్తిపోతల పథకాలకు నీటిని వదిలి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సీఎం, మంత్రులు ఎక్కడి నుంచి వసూలు చేయాలి, ఎప్పుడు ఢిల్లీకి పంపాలన్న తపనతో పనిచేస్తున్నారని అన్నారు. 110 రోజుల పరిపాలనను గాలికి వదిలేశారని, ప్రభుత్వ వైఫల్యాలను గత ప్రభుత్వంపై ఆపాదించి పబ్బం గడుపుతున్నారని అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజవర్గ కేంద్రాల్లో చేపట్టే ధర్నాలు, దీక్షలకు పార్టీ శ్రేణులు, అభిమానులు, రైతులు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు యాదగిరిరెడ్డి, రవినాయక్, సైదులుయాదవ్, హతీరాంనాయక్, సర్సింహారెడ్డి, బిక్షంగౌడ్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.


నేరేడుగొమ్ములో ఎన్నికల సన్నాహక సమావేశంలో స్థానిక గిరిజనులతో జానారెడ్డి

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

చందంపేట, ఏప్రిల్ 5: దేవరకొండ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలకేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సుదీర్ఘకాలం నల్లగొండ జిల్లాకు మంత్రిగా పనిచేయడంతో ఈ ప్రాంత సమస్యపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలన్నారు.అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ మండలంలోని అంబాభవానీ ప్రాజెక్టు, నక్కలగండి ఎత్తిపోతల పథకాన్ని ఐదేళ్లలో పూర్తిచేసి మండలాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలునాయక్ సహ కారంతో సీనియర్ నాయకులు జానారెడ్డి సూచనలతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని, ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, జడ్పీటీసీ బాలునాయక్, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

మిర్యాలగూడ అర్బన్ : మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీతారాంపురం చిన్నమసీద్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే బీఎల్ఆర్, జైవీర్‌రెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘు వీర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, సంజీవరెడ్డి, రామలింగయ్యయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సలీం, ఆరిఫ్, జానీ, చాంద్‌పాషా, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటేస్తే నిష్ప్రయోజనం


ప్రచారంలో భాగంగా కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

చిట్యాల, ఏప్రిల్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. గల్లీలో, ఢిల్లీలో లేని బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఏలాభం ఉండదని, అలాగే కల్లబొల్లి హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఢిల్లీలో ఎలాగూ గెలవదని, ఆ పార్టీకి ఓటేయవద్దని కోరారు. హామీలను అమలుచేయలేక కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం పేరుతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోందన్నారు. గతంలో తాను ఎంపీగా భువనగిరి రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. మోదీ సార్థ్యంలో దేశం సురక్షితంగా ఉండడమే కాక సుస్థిర అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మహిళలతో ముచ్చటించారు. కార్యక్రమంలో మైల నర్సింహ, కంబాలపల్లి సతీష్, కూరెళ్ల శ్రీను, పొట్లపల్లి నర్సింహ, గంజి గోవర్ధన్, కన్నెబోయిన మహలింగం, జయారపు రామకృష్ణ, మాన శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఐలాపురం చెరువులో గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సాగర్ నీటితో చెరువులు, కుంటలను నింపాలి

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 5: నాగార్జునసాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులు, కుంటలను నింపి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామ చెరువులో గిరిజన మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోయాయని, ఫలితంగా సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడిందన్నారు. ముఖ్యంగా వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఐలాపురం గ్రామస్థులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సాగర్ మెయిన్ కెనాల్ ద్వారా తాగునీటిని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం సాగర్ ఎడమకాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి కోసం నీటిని తీసుకెళ్తున్నారని, అదేవిధంగా నల్లగొండ జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాగర్ ప్రధానకాల్వ ద్వారా చుట్టుపక్కల ఉన్న చెరువులను, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. తద్వారా భూగర్భజలాలు పెరిగి తాగునీటి ఎద్దడిని నివారించవచ్చని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సాగర్ నీటితో చెరువులను, కుంటలను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, రాంమ్మూర్తి, నాగేశ్వర్‌నాయక్, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లు, జగన్‌నాయక్, బాణావత్ నాగమ్మ, సునీత, లక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 5: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు ఎక్సైజ్ సీఐ దీపిక శుక్రవారం తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుజిత్‌సాహు ఆలేరు మండలంలోని రఘునాథ్‌పూర్ గ్రామశివారులో ఏడాదిగా నివాసం ఉంటున్నాడు. ఆలేరులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సుజిత్‌సాహును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద 118 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2500 ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు రాధాకిషన్, నిరోశ, విజయ్, సిబ్బంది ఉన్నారు.

చింతలపాలెంలో..

మేళ్లచెర్వు: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధర్మాపురంతండాకు చెందిన మహిళ కూలీ పని చేసుకుంటూ, స్నేహితుల ద్వారా గంజాయికి అలవాటుపడింది. కొంతకాలంగా గంజాయి సప్లయ్ చేసి వారి నుంచి అధిక మొత్తంలో కొనుగోలు చేసి, చిన్నచిన్న ప్యాకెట్ల ద్వారా జగ్గయ్యపేట నుంచి ప్యాసింజర్ ఆటోల్లో మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని పరిశ్రమల్లో పనిచేసే కూలీలకు విక్రయిస్తుంది. అలా గంజాయిని విక్రయించడానికి వెళ్తుండగా గురువారం చింతలపాలెం బస్టాండ్ వద్ద మహిళను పట్టుబడి చేసి 200 గ్రాములు గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కారు దగ్ధమైన సంఘటన శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో చోటుచేసుకుంది. ఎస్ఐ జీ వెంకటశ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా కేంద్రంలోని గోపాల్‌పూర్‌కు చెందిన చొల్లేటి సుధాకర్‌రెడ్డి తన స్నేహితుడికి చెందిన కుమారస్వామి కారును తీసుకొని భార్య రేవతి, సబితతో కలిసి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆలేరులోని కందిగడతండా వద్దకు వస్తున్న క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డుపైపు వెళ్లి పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ వేణుతో పాటు సుధాకర్‌రెడ్డి, రేవతిలకు తీవ్రగాయాలయ్యాయి. ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై కారు యజమాని కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో కారు దగ్ధమైంది.

మృతుడి ఆచూకీ లభ్యం

తిప్పర్తి, ఏప్రిల్ 5 : గుర్తు తెలియని మృతదేహంగా గురువారం వెలుగులోకి వచ్చిన మృతుడి ఆచూకీ తెలిసినట్లు శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్ఐ డీ రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట పరిధిలోని పాటిగడ్డకు చెందిన జోగిని యాదగిరి(38) రెండేళ్లుగా ఫిట్స్‌వ్యాధితో బాధపడుతూ మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. మార్చి 30వ తేదీన వారి బంధువుల శుభకార్యం నిమిత్తం తల్లి ఘట్కేసర్‌కు వెళ్లగా మద్యం సేవించిన మైకంలో ఇంటి నుంచి బైటికి వెళ్లిన యాదగిరి ఇంటికి వెళ్లలేదు. అయితే గురువారం తిప్పర్తి మండలం బండ్లవారిగూడెం సమీపంలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు తెలిపారు. వారు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేశారు. శుభ కార్యం నిమిత్తం ఊరు వెళ్లి వచ్చిన తల్లి కుమారుడు కనబడుటలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే క్రమంలో గురువారం మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డుతో సమాచార నిమిత్తం తిప్పర్తి పోలీసులు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో శుక్రవారం వారి బంధువులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫిట్స్‌తో కుమారుడు చనిపోయాడని తల్లి రాములమ్మ నిర్ధారించుకొని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు...



నార్కట్‌పల్లి : వరుస సెలవులు, శుభకార్యాలు ఉండటంతో నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ శుక్రవారం సాయంత్రం ప్రయాణికులతో రద్దీ నెలకొంది. హైద్రాబాద్ వైపు వెళ్లే బస్సులు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు సుమారు 2 గంటల పాటు ఎదురుచూశారు.

బకాయి వేతనాలు ఇవ్వాలి

విధులు బహిష్కరించి ధర్నా చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులు



కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ధర్నా చేపడుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 5: బకాయి ఉన్న వేతనాలు విడుదల చేయాలని గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం రా ష్ట్ర అధ్యక్షుడు యజ్ఞ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి స్థానిక చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. వెంటనే బకాయి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కోట్ల సతీష్, వెంకటయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి

త్రిపురారం, ఏప్రిల్ 5: పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జడ్పీటీసీ ధనావత్ భారతి, మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, కసిరెడ్డి నరేష్, అనుముల వెంకట్‌రెడ్డి, శ్రీను, శ్రీనివాస్, రవి, బాలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

హాలియా: ముస్లింలకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి రంజాన్ తోఫాను శుక్రవారం అందజేశారు. అనుముల మండలం మదారిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ సర్వర్ ఆధ్వర్యంలో ముస్లింలకు మైనార్టీలకు అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ యడవల్లి నరేందర్ రెడ్డి, వైస్‌చైర్మన్ పిల్లి చంద్రకళ, పార్టీ మండల అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు నారాయణ, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎంను ఆదరించాలి

నకిరేకల్, ఏప్రిల్ 5: ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎంను ప్రజలు ఆదరించాలని భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలంగా సీపీఎం అవినీతి, అక్రమాలపై ప్రజలకు మద్దతుగా పోరాడుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. మూసీ ప్రాజెక్టును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీల, మండల, పట్టణ అధ్యక్షులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు చిన్నవెంకులు, వంటెపాక కృష్ణ, ఆకుల భాస్కర్, లకపక రాజు, నర్సింహ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును పార్లమెంటుకు పంపాలి

చండూరురూరల్: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడి, ప్రశ్నించే గొంతును పార్లమెంటుకు పంపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. చండూరు మండలంలోని నెర్మట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్‌ను ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నాయకుడు అంతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, నాయకులు జెర్రిపోతుల ధనంజయగౌడ్, ఈరటి వెంకన్న, బుర్కల అంజయ్య, స్వామి, శంకర్, కొత్తపల్లి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శుభం జరగాలి : మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 5: క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభం జరగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవా రం హైదరాబాద్‌లోని తన నివాసంలో శ్రీ భ క్తాంజనేయ స్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ క్రోధి నామ సంవత్సరం పంచాంగాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీ భక్తాంజనేయస్వామి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిప్రగడ శ్రీనివాస్‌శర్మ, గౌరవాధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ముఖ్య సలహాదారు రుద్రాక్షి నర్సిం హ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన నల్లగొండ పట్టణ సమీపంలోని ఆర్జాలబావిలోని ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సర పంచాంగాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. బ్రాహ్మణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కంటి చూపు ఎంతో ప్రధానమైనది

ఆటా అధ్యక్షురాలు మధులత, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 5: ప్రతి ఒక్కరికీ కంటిచూపు ఎంతో ప్రధానమైనదని అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షురాలు బొమ్మినేని మధులత, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, అమెరికా తెలుగు అసోసియేషన్‌ల సౌజన్యంతో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా కంటి శుక్ల శస్త్రచికిత్స వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు అరుల్‌కుమార్ మాట్లాడుతూ కంటి శుక్లాల సమస్యలు ఉన్న వారికి ఎలాంటి నొప్పి లేకుండా కుట్లు లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటా మాజీ అధ్యక్షుడు ఏసిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కన్వీనర్ పాశం కిరణ్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీధర్, వైద్యులు శంకర్, అభిజిత్, అభిశిక్త సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం ఆశయసాధనకు కృషి చేయాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

భారతదేశ మొట్టమొదటి దళిత ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యేలు బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో పార్టీలు, దళితసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ రాజకీయ నాయకులు బాబుజగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి దేశ ఉపప్రధానిగా, కేంద్ర మంత్రిగా దేశానికి సేవలు అందించాడని గుర్తు చేశారు. పేద, దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

● దేవరకొండలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల జేఏసీ, బీసీ సంక్షేమసంఘం, మాదిగ హక్కుల దండోరా నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, భాస్కరచారి, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్‌వద్ద గల బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీతకురుపయ్య, కౌన్సిలర్లు శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, జావిద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఐ, దళితసంఘాల ఐక్యవేదిక, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, దైద సత్యం, సూర్యనారాయణ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు దైద రవీందర్, పూజార్ల శంభయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులుమాదిగ, శ్రీనివాస్, జహంగీర్, రాఘవరెడ్డి, వెంకన్న, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దె సుమన్, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంతో పాటు ఎల్లారెడ్డిగూడెం, అమ్మనబోలు గ్రామాల్లో ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కల్లూరి యాదగిరి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీ సైదులు, నాయకులు శ్రీధర్, తరుణ్ పాల్గొన్నారు.

● హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మేదరి దేవేందర్, నాయకులు పాపిరెడ్డి, పరుశురాంగౌడ్ పాల్గొన్నారు.

● చిట్యాలలో దళితసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పోకల దేవాస్, చిత్రగంటి ప్రవీణ్, కన్నెబోయిన మహాలింగం తదితరులు పాల్గొన్నారు.

●కట్టంగూరులో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, ఆర్‌ఐ కుమార్‌రెడ్డి, ఏపీవో రాంమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్, సీసీలు పాల్గొన్నారు.

● పెద్దవూరలో నిర్వహించిన కార్యక్రమాల్లో జాతీయ విగ్రహాల నిర్మాణ వ్యవస్థాపకుడు పులిమాల కృష్ణారావు, శేఖర్, వెంకటేశ్వర్లు, యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, నాయకులు దున్న యాదగిరి, కత్తుల షణ్ముఖ, కత్తుల మల్లేశం, కత్తుల జగన్‌కుమార్, సంహితరాణి, వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్, మాజీ కౌన్సిలర్ దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాములునాయక్



మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

'జనజాతర' సభను విజయవంతం చేయాలి



నకిరేకల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వీరేశం

నల్లగొండటౌన్, నకిరేకల్, ఏప్రిల్ 5: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ జనజాతర బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నకిరేకల్, నల్లగొండ పట్టణాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జన జాతర కార్యక్రమంలో రాహుల్‌గాంధీ పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని 100రోజుల్లోపే అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశంలో ప్రజాస్వామ్యం నిలుస్తుందన్నారు. దేవుడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ శ్రేణులంతా జన జాతర బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేసవిలో మండే ఎండలను దృష్టిలో ఉంచుకొని సమావేశానికి హాజరయ్యే కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయా సమావేశాల్లో భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, దైద రవీందర్, చామల శ్రీనివాస్, అల్గుబెల్లి రవీందర్‌రెడ్డి, చిట్యాల మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, సమావేశంలో నల్లగొండ మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్ది సుమన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ వెంకటేశం

చండూరు, ఏప్రిల్ 5: వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా, నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ అవ్వారు గీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. చండూరు మునిసిపాలిటీ పరిధిలో పశువైద్యశాలకు చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయని వాటిని ఎందుకు కాపాడటం లేదని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ నిర్వాహకులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎక్సైజ్ అధికారులను నిలదీశారు. కొంతమంది అధికారుల అలసత్వంలో గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయని అన్నారు. తీరు మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు ఎందుకు హాజరుకాలేదని ఆరా తీశారు. తేరట్‌పల్లి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి పనులు జరగడం లేదని ఎంపీటీసీ గొరిగె సత్తయ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు వైద్యసౌకర్యాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో సరోజ, ఎంపీటీసీలు గొరిగె సత్తయ్య, చేపూరి యాదయ్య, కావలి మంగమ్మ, పీఆర్ఏఈ రమేష్, ఎంపీవో స్వరూపరాణి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

చండూరు: చండూరు మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన వెంచర్లలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను కొంతమంది వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, వాటిని ప్రభుత్వం రద్దు చేయాలని చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు అధికారుల విచారణలో తేలినా, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ అవ్వారు గీత, ఎంపీటీసీలు గొరిగె సత్తయ్య, చేపూరి యాదయ్య, అవ్వారు శ్రీనువాసులు, మంగమ్మ పాల్గొన్నారు.

రంజాన్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 5: రంజాన్ పండుగ ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాస ఉపవా స దీక్షలను పురస్కరించుకుని మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద గల ముస్లింలకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన షేక్ షంషీర్ అలీ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సుమారు 100మంది ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ముస్లింలు సోదరులు ఉపవాస దీక్షలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, నాయకులు, ముస్లింలు ఇలీయాస్, షేక్ గాలీబ్, బాబ్‌జాన్, అక్బర్, ఖాజ్‌మియా, ఇబ్రహీం, రహీమ్, డాక్టర్ రహీం, వజీర్ అలీ, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా తాగునీటి ట్యాంకుల నిర్వహణ



రేగులగడ్డ కాలనీలోని నీటి ట్యాంకు వద్ద బురద గుంత

కేతేపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారాయి. కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయితీల పరిధిలో 59 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు ఉండగా వీటిలో 28 ట్యాంకులకు మిషన్ భగీరథ పథకం కింద కృష్ణా నీరు, మరో 31 ట్యాంకులకు స్థానిక బోర్ల నీటిని అందిస్తున్నారు. వీటిల్లో అధిక భాగం ట్యాంకులు అపరిశుభ్రంగానే దర్శనమిస్తున్నాయి. 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉన్నా నెలల తరబడి వాటిని శుభ్రం చేసేవారే లేకుండా పోయారు. ఇక ట్యాంకుల పరిసరాలు మరింత అధ్వానంగా ఉన్నాయి. ట్యాంకులు నిండిన వెంటనే పైప్‌లైన్లకు నీటిని వదలకపోవడంతో ట్యాంకులు నీటి ఓవర్‌ఫ్లోతో ట్యాంకుల వపరిసరాల్లో బురదగుంతలు తయారయ్యాయి.

● *ట్యాంకుల శుభ్రం...మూతలతో మూసివేత*

నార్కట్‌పల్లి: నాగార్జునసాగర్‌లో తాగునీటి ట్యాంకులో పడి వానరాలు మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి మండల వ్యాప్తంగా నీటి ట్యాంకుల శుభ్రం... ట్యాంకులపై మూతల మూసివేత కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. నీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ట్యాంకులపై మూతలను మూసివేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కట్టంగూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో మల్లారెడ్డి

నార్కట్‌పల్లి, కట్టంగూరు, ఏప్రిల్ 5: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, సీఈవో మల్లారెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాల్లో శుక్రవారం వారు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐ తరుణ్, ఏఈవో విజయలక్ష్మి, సీఈవో వెంకటయ్య, రైతులు వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, నరేష్, దామోదర్‌రెడ్డి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని కల్మెర గ్రామంలో సురేష్, కత్తుల యాదగిరి, చెరుకు నర్సింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పత్రికల సమస్యలను పరిష్కరించాలి



రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5: చిన్న పత్రికల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని చిన్న పత్రికల సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న పత్రికలకు నూతన ఇన్‌పానెల్‌మెంట్, అక్రిడిటేషన్ కార్డులు, రేట్ కార్డు, గ్రేడింగ్ పెరుగుదల, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పిట్టల రామకృష్ణ, నాయకులు దోసపాటి ముత్తయ్య, అన్నెబోయిన మట్టయ్య, వేముల వెంకటేశ్వర్లు, మధు, శోభన్‌బాబు, నరసింహస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, కుర్దాస్, కృష్ణారావు, మల్లయ్య, సందీప్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మాడ్గులపల్లి: జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి ఐదు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ కపట నాటకాలు ఆడుతున్నాయని అన్నారు.

శాలిగౌరారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరిలో శనివారం నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ కోరారు. మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కట్టంగూరు: భువనగిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలో అయిటిపాముల గ్రామంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఎం నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, గోలి మహేశ్వరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులను అరికట్టాలని కోరుతూ వైద్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్యగౌడ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు దోచుకుంటున్నాయని, లాభార్జనే ధ్యేయంగా వైద్య వ్యాపారం చేస్తున్నాయని అన్నారు. అలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, ఫీజులు నియంత్రించాలని కోరారు. ఆయన వెంట నాయకులు విక్రమ్, నర్సింహ, వీటి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడురూరల్: మునుగోడు మండలపరిధిలోని కోతులారం గ్రామంలో పీసీసీ ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వట్టికొట్టి శేఖర్ మాతృమూర్తి మృతి చెందింది. ఆమె మృతదేహానికి భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శేఖర్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మాజీ ఎంపీపీ పొలగోని సత్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రం, బి.నరసింహ, కార్యదర్శి చాపల శ్రీను తదితరులు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవ దళ్ పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆడోత్ అశోక్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ అశోక్‌కు నియామకపత్రం అందజేశారు.

వేములపల్లి: సాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సాగర్ ఎడమకాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవిలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తాగునీటి కోసం ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు నీళ్లు తరలించుకుపోతుంటే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

చిట్యాల రూరల్: మండలంలోని పిట్టంపల్లిలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తుమ్మల వెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా అందె మారయ్యయాదవ్, ప్రధానకార్యదర్శిగా సింగిరెడ్డి అనంతరెడ్డి, కోశాధికారి సింగిరెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శిగా చిర్రగోని వెంకటేష్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు.

నల్లగొండ: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా రావెళ్ల కాశమ్మ శుక్రవారం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

చిట్యాల రూరల్: వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం సేవాకార్యక్రమమేనని కెనరాబ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (కేఈయూ) రాష్ట్ర సహాయకార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మండలంలోని వట్టిమర్తిలో కేఈఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

27 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5: దేవరకొండ, నార్కట్‌పల్లిలో 27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవరకొండ మండలం సబావత్‌తండాలో సబావత్ కొండల్ బొలెరో వాహనంలో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధమవుతుండగా శుక్రవారం పట్టుకున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. కొండల్ రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి కొండల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● నార్కట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం పచ్చలబట్టు తండాకు చెందిన గుగులోతు కిరణ్ శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో తిరిగి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. ఇదే మండలంలోని కొండపాకగూడెం గ్రామంలో గల కోళ్ల ఫారం నిర్వాహకులకు విక్రయించేందుకు తన ఆటోలో తరలిస్తున్నాడు. తమకు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి ఆటోను పట్టుకుని అందులో ఉన్న 10క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుత్తా వరప్రసాద్‌రెడ్డి వ్యవసాయం చేస్తూనే గేదెలను పెంచుతూ పాల వ్యాపారం చేస్తున్నా డు. కొన్ని రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగిపోగా కరెంట్ తీగలు చే తికందే ఎత్తుకు చేరాయి. పొలంలో గడ్డి మేస్తూ వెళ్లిన ఓ గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతానిక గురైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.